TGTEL/25/A0977

# తౌవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తౌవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 337 | సోమవారం 14-07-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.

## కవితకు తీన్మార్ మల్లన్న క్షమాపణలు చెప్పాలి

**తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్**

**బర్కత్‌పుర, జూలై 13 :** తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా తీన్మార్ మల్లన్న క్షమాపణలు చెప్పాలని తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ నేతలు డిమాండ్ చేశారు. బీసీల కోసం కవిత ఉద్యమిస్తుంటే జీర్ణించుకోలేని తీన్మార్ మల్లన్న.. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ బోళ్ల శివశంకర్, తెలంగాణ జాగృతి అధికార ప్రతినిధి ఎలిజాల దత్తాత్రేయ మాట్లాడారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వ్యక్తిగత దూషణల కారణంగా క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి జరిగిందని, నోటి దురుసును తగ్గించుకోకపోతే మరిన్ని దాడులు తప్పవని హెచ్చరించారు. బీసీ ఉద్యమాన్ని భూజాన ఎత్తుకున్న ఎమ్మెల్సీ కవిత.. ఏ కులంలో పుడితే మల్లన్నకు ఎందుకని ప్రశ్నించారు.

## చిన్నారుల మధ్య ఘనంగా జన్మదిన వేడుకలు

తౌవ్వ ,ప్రతినిధి ,జులై 13:



పట్టణం లోని లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వీరన్నసారథ్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ పాల్వాయి సౌజన్య జన్మదినం సందర్భంగా ఆశాభవన్ చిల్డ్రన్ హెూమ్ లో చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆశాభవన్లో ఇంటర్ పూర్తి చేసుకొని ఉన్నత చదువుల కోసం వెళ్తున్న వేరే ప్రాంతానికి వెళ్తున్న విద్యార్థి పాల బిందెల కార్తీక్ కి కాలేజ్ బుక్స్ , ఫీజు (పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు )ఈ కార్యక్రమంలో పిల్లలందరితో మాట్లాడుతూ మీరందరూ మంచిగా చదువులో రాణించాలని విద్య ద్వారానే అనుకున్న లక్ష్యానికి చేరువ అవుతారని పిల్లలు ముఖ్యంగా శుభ్రత సూత్రాలు ఎల్లప్పుడూ పాటించాలని పిల్లలకు తెలియజేసినారు ఈ సందర్భంగా ఆశాభవన్ బాధ్యులు డాక్టర్ పాల్వాయి సౌజన్య గారికి మరియు లయన్స్ క్లబ్ బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలోలయన్ పరకాల శ్రీనివాస్ రెడ్డి, లయన్ రవిచంద్రారెడ్డి,లయన్ ఏకాంబరం,లయన్ కాలీనాథ్,లయన్ శ్రీమతి లావణ్య,ఆశ భవన్ విద్యార్థులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## రేపు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్

**పీవీ సంస్మరణ సభలో పాల్గొనే చాన్స్**

**అక్కడే ఏపీ సీఎం చంద్రబాబుతో వేదిక పంచుకోనున్న రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, జూలై 13**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారైనట్టు తెలిసింది. మంగళవారం (15న) మధ్యాహ్నమే ఆయన ఢిల్లీ వెళతారని.. 16, 17 తేదీల్లోనూ అక్కడే ఉంటారని సమాచారం. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవడంతో పాటు పార్టీ అధిష్ఠానంతో భేటీకానున్నట్టు తెలిసింది. 15న సాయంత్రం ఢిల్లీలో జరిగే మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ సభలో సీఎం పాల్గొనే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో.. ఇరు తెలుగు రాష్ట్రాల సీఎంలు ఒకే వేదికను పంచుకునే అవకాశం ఉంది.



# బోనమెత్తిన భాగ్యనగరం

## మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్

**- హైదరాబాద్‌లో బోనాల శోభ.. భక్త జనసంద్రమైన లష్కర్ - గోల్కొండ కోటలో ఘనంగా 6వ బోనం**

**హైదరాబాద్, జూలై 13:** హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు ఆదివారం బోనాల శోభతో కళకళలాడాయి. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో లష్కర్ బోనాల జాతర ఆదివారం ప్రారంభమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 11.32 గంటలకు మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రేవంత్‌ను అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అంతకుముందు తెల్లవారుజామున 4 గంటలకు మంత్రి పొన్నంప్రభాకర్ అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. బోనాల సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు, శివసత్తులు, జోగినీలు.. బోనాలు, తొట్టెలు, ఒడి బియ్యం సమర్పిస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, దానం నాగేందర్, చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డి, ముఠా గోపాల్, శ్రీగణేష్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ శైలజా రామయ్యార్, కలెక్టర్ దాసరి హరిచందన, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఉజ్జయినీ మహాకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.



## పాలన అంటే శంకుస్థాపనలే కాదు : కేటీఆర్



**హైదరాబాద్, జూలై 13 :** పరిపాలన అంటే కేవలం శంకుస్థాపనలు చేయడం మాత్రమే కాదని, అభివృద్ధి, ప్రగతి అంటే రాజకీయ హంగులు ఆర్భాటాలు కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ దూరదృష్టి ఫలితంగా ఈనాడు తెలంగాణ రెండు అద్భుత ఫలితాలను సాధించిందని చెప్పారు. ఒకటి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయితే, రెండవది యాదాద్రి థర్మల్ ప్లాంట్ అని తెలిపారు. సీతారామ ద్వారా ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందుతుందన్నారు. దామరచర్ల అల్ట్రా మెగా ?థర్మల్ ప్లాంట్‌లోని యూనిట్ వన్ 72 గంటల కోడ్(సీఓడీ)ను విజయవంతంగా పూర్తి చేసిందని తెలిపారు. ఈమేరకు కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## డిసెంబరులో గగన్‌యాన్

**మానవరహిత రాకెట్ ప్రయోగం : ఇస్రో చైర్మన్ నారాయణన్**

**చెన్నై, జూలై 13:** మానవులను అంతరిక్షంలోకి పంపే గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా వచ్చే డిసెంబరులో మానవరహిత రాకెట్ ప్రయోగం జరపనున్నట్లు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రకటించారు. తమిళనాడులోని కన్నియాకుమారి జిల్లా కులశేఖర పట్టణంలో యువ శాస్త్రవేత్తల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ.. 'గగన్‌యాన్' మిషన్ ద్వారా ఒక భారతీయుడిని ఏవోజీ పద్ధతి ప్రకారం రాకెట్‌లో అంతరిక్షానికి పంపి.. అక్కడ పరిశోధనల అనంతరం మళ్లీ భూమి మీదకు తీసుకురానున్నామని చెప్పారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**మంచిర్యాల, జూలై 13 :**

రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఉప ముఖ్యమంత్రి మల్లుబట్టి విక్రమార్క తెలిపారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డ్వాక్రా సంఘాలను పూర్తిగా గాలికి వదిలేశారని, మహిళా సంఘాలను మహాలక్ష్మిగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తోందని అన్నారు. మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆయన ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. దండేపల్లి మండలం రెబ్బనపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి మాట్లాడారు. రూ. 21,630 కోట్లతో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నామని, ప్రతి నెలా 12 నుంచి 25 తేదీ వరకు క్రమం తప్పకుండా మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మూల కారణమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఒక ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి రైతులకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు.

## వచ్చే జూన్‌లో రిటైర్ కానున్న ఖర్గే

**దేవెగౌడ, దిగ్విజయ్‌తో పాటు కొందరు కేంద్ర మంత్రులు కూడా..**

**ఏపీ నుంచి నలుగురు.. తెలంగాణ నుంచి ఇద్దరు**



**న్యూఢిల్లీ, జూలై 13:** రాజ్యసభలో ఏకంగా 72 స్థానాలకు 2026 ఏప్రిల్, జూన్, నవంబరుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. పలువురు కీలక నేతలు, కొందరు కేంద్ర మంత్రుల పదవీకాలం వచ్చే ఏడాది ముగియనుంది. వీరిలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ (కర్ణాటక), కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్, కేంద్ర మంత్రి జార్జి కురియన్ (మధ్యప్రదేశ్), కేంద్ర మంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టూ (రాజస్థాన్), జేఎంఎం వ్యవస్థాపకుడు శిబూ సోరెన్ (జార?ండ్), కాంగ్రెస్ నేత శక్తిసింగ్ గోహిల్ (గుజరాత్), వైసీపీ ఎంపీలు పరిమళ్ నత్వానీ, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, టీడీపీ ఎంపీ సానా సతీశ్ (ఆంధ్రప్రదేశ్) కూడా జూన్‌లో రిటైర్ కానున్నారు. వీరికి ముందే ఏప్రిల్‌లో ఎన్‌సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే (ఆర్‌పీఐ) సహా మహారాష్ట్ర నుంచి ఏడుగురు పదవీవిరమణ చేయనున్నారు. తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ, బీఆర్ఎస్ కు చెందిన కేఆర్ సురేశ్‌రెడ్డి కూడా అదే నెలలో రిటైర్ కానున్నారు. మహారాష్ట్ర-7, తమిళనాడు-6, బెంగాల్-5, బిహార్-5, ఒడిసా-4, అసోం-3, తెలంగాణ-2, ఛత్తీస్‌గఢ్-2, హరియాణా-2, హిమాచల్ నుంచి ఒక్కరు చొప్పున ఏప్రిల్‌లో రిటైరవుతారు. ఉత్తరప్రదేశ్ నుంచి 10 మంది, ఉత్తరాఖండ్ నుంచి ఒకరు నవంబరులో పదవీవిరమణ చేస్తారు.

## స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సూచన**

**నేడు నల్గొండ, రేపు సూర్యాపేట జిల్లాల్లో పర్యటన**



రాంనగర్/హైదరాబాద్, జూలై 13: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సూచించారు. బీజేపీ సిద్ధాంతాలు, మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఆదివారం బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాంచందర్‌రావును ఆయన నివాసంలో శాలువాకప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. కాగా, ఆయన సోమవారం నుంచి రెండు రోజులపాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు నల్గొండలో వివిధ సంఘాలు, న్యాయవాదులు, వైద్యులతో, అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సూర్యాపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అక్కడ పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. రాత్రికి ఆయన స్వగ్రామం కోదాడ నియోజకవర్గంలోని నల్లబండగూడెంలో బస చేస్తారు. మంగళవారం అక్కడ రైతులతో సమావేశమవుతారు. ఉదయం 10 గంటలకు కోదాడలో రైతులతో, మధ్యాహ్నం 1.30గంటలకు చౌటుప్పల్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించే సమావేశాల్లో పాల్గొంటారు.

## కవితపై మల్లన్న వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం

**ఆయన కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమే..**

**చట్టపరిధిలో అందరూ పనిచేసుకోవాలి: మహేశ్ గౌడ్**



హైదరాబాద్, జూలై 13: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని.. కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే మల్లన్న కార్యాలయంపై దాడి చట్టవ్యతిరేకమని మండిపడ్డారు. చట్ట పరిధిలో అందరూ పనిచేసుకోవాలని ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు.

## భారత్‌కు సౌదీ అరేబియా ఎరువులు

**సౌదీలో పర్యటించిన కేంద్ర మంత్రి నడ్డా**



**హైదరాబాద్, జూలై 13:** ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన కొరతను తీర్చేందుకు సౌదీ అరేబియా.. భారత్‌కు ఎరువులు సరఫరా చేయనుంది. కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రి జేపీ నడ్డా ఆదివారం సౌదీ అరేబియాలో పర్యటించారు. అత్యధికంగా యూరియాతోపాటు ఇతర ఎరువులను ఉత్పత్తి చేసే క్రిబ్కో, ఇతర సంస్థల ప్రతినిధి బృందం, భారతీయ రాయబారి సోహైల్ అహ్మద్ ఖాన్‌తో కలిసి రాస్ అల్ ఖైర్ ప్రాంతంలో ఉన్న గనులు, ఎరువుల సంస్థ మాదెన్‌కు చెందిన ఫ్యాక్టరీని సందర్శించారు. శుక్రవారం రాత్రి సౌదీకి వచ్చిన మంత్రి ఇక్కడి అధికారులు, వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. ఎరువుల ఉత్పత్తి, సరఫరాల తదితరాలపై వారితో చర్చించారు. యూరియా, ఇతర ఎరువులను మాదెన్.. భారత్‌కు ఎగుమతి చేస్తుంది. భారత్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో కేంద్రం 52లక్షల టన్నుల యూరియా వినియోగాన్ని అంచనావేయగా, ఇంకా నాట్లు పూర్తవకముందే 48లక్షల టన్నుల విక్రయం జరిగిందని, పంట చేతికొచ్చే సరికి యూరియా ఇంకా అవసరమవుతుందని ప్రభుత్వం అంచనావేస్తోంది. ప్రతి సీజన్‌లో రాష్ట్రాల నుంచి ఎరువులకు అనూహ్యమైన డిమాండ్ ఏర్పడడంతో ఎరువులు ప్రత్యేకించి.. యూరియా, పొటాష్ సమస్యను పరిష్కరించే దశగా మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

# జర్నలిస్టులు ప్రజా శ్రేయస్సుకోసం వార్తలు రాయాలి

**పాత్రికేయులు నిబద్ధతతో ఉండాలి - జర్నలిస్టులందరూ సమానత్వంతో ఉండాలి**

**టీయూడబ్ల్యూజేఐజేయు జిల్లా అధ్యక్షుడు చిత్తూరు శ్రీనివాస్,**



**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి జూలై 13,**

జర్నలిస్టులు నిబద్ధతతో ఉంటూ ప్రజా శ్రేయస్సు కోసం వార్తలు ప్రచురించాలని టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాల జర్నలిస్టుల సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజం కోసం ప్రజా శ్రేయసు కోసం కృషి చేయాలని అన్నారు. తారతమ్యం భేదం లేకుండా జర్నలిస్టులందరూ సమానత్వంతో ఉండాలని కోరారు. జర్నలిస్టులు కొంతమంది దారి తప్పుతూ అప్రవర్తనలు ప్రవర్తిస్తూ పాత్రికేయ వృత్తికే కలంకాలను తీసుకొస్తున్నారని అలాంటి వారిని సంఘం చూస్తూ ఊరుకోదని సంఘము నుంచి బహిష్కరించేందుకు వెనకాడబోమని ఆయన హెచ్చరించారు. పాత్రికేయులు నిబద్ధతతో ఉండి సమస్యలు ఎదురైతే సంఘం చూస్తూ ఊరుకోదని వారికి అండగా ఉంటుందని అన్నారు. జర్నలిస్టులు ఎంతవరకు ప్రవర్తించాలో అంతే ఉండాలని మనది కానీ దాంట్లో వేలు పెడితే సంఘం ఏమి చేయలేదని తేల్చి చెప్పారు.బిబి మాల జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద శ్రీనివాస్ మాట్లాడుతూ దళిత జర్నలిస్టుల సంక్షేమ నికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. పాత్రికేయులందరూ తారతమ్య భేదం లేకుండా కులమతాలకు అతీతంగా ఉంటూ విలేకరుల హక్కులు సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు జర్నలిస్టులను గుర్తించి సంక్షేమ పథకాలు వారికి కూడా వర్తించేటట్టు జీవో తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ రాష్ట్ర నాయకులు గంధసిరి రవి, వీరభద్ర స్వామి దేవాలయ ధర్మకర్త గణేష్, టీఎంజేయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డు అశోక్, ప్రధాన కార్యదర్శి బేతమల్ల సహదేవ్, జిల్లా అధికార ప్రతినిధి దార్ల భాస్కర్, ఉపాధ్యక్షులు గండమాల రోషయ్య, వెలిశాల శ్యామ్, బేతమల్ల అశోక్, కోశాధికారి సంద అనిల్, ప్రచార కార్యదర్శి కొప్పుల శ్రీనివాస్, అసోసియేషన్ నాయకులు పేర్ల గణేష్, ఎడ్ల నరేష్, కముటం నాగేష్, చింతమల్ల ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా పని చేసే జర్నలిజానికి సంపూర్ణ మద్దతు

**నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి**

**టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నర్సంపేట ఎమ్మెల్యేను కలిసిన నూతన కమిటీ.**

**తొవ్వ, నర్సంపేట, జూలై 13:**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జక్కుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డిని ఆదివారం హనుమకొండ లోని తన నివాసంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజెఎఫ్ వరంగల్ జిల్లా కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో జర్నలిస్టులకు తాను చేయగలిగిన సహాయ సహకారం అందజేస్తానని ఎల్లవేళలా జర్నలిస్టులకు అండగా ఉంటానని తెలిపారు. జర్నలిస్టులు రాజకీయాలకతీతంగా ప్రజా సమస్యలను వెలికి తీసి పరిష్కారం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. రాజకీయాలకు తావులేని సమాజ చైతన్యం కోసం జర్నలిజం ఉపయోగపడాలని దారి తప్పుతున్న వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు జర్నలిజం ఉపయోగపడాలని అటువంటి సమాజ హిత జర్నలిజానికి ప్రభుత్వాలు ,ప్రతిపక్షాలు ఎప్పుడు జవాబుదారీగా పని చేస్తాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా సమాజం కోసం పాటుపడే జర్నలిస్టులకు



తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తను చేయగలిగిన సహకారం తప్పనిసరిగా అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ తో అన్నారు. ఎమ్మెల్యే దొంతిని కలిసిన వారిలో టిడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బొట్లస్వామిదాస్, కోశాధికారి భానోత్ సురేష్,ఉపాధ్యక్షుడు వెల్ది రాజేందర్, సంయుక్త కార్యదర్శి భావండ్ల పెల్లి కిరణ్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పాలడుగుల సురేందర్, సీనియర్ జర్నలిస్ట్ సాదిక్ పాషా, సభ్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు భయపడే బీసీ రిజర్వేషన్లు

**స్థానిక సంస్థ ఎన్నికల్లో 80 శాతం గెలుపే టిఆర్ఎస్ దే- ప్రజలందరూ చూపు టిఆర్ఎస్ వైపు,**

**ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు, -డోర్నకల్ మాజీ శాసనసభ్యులు డి ఎస్ రెడ్యా నాయక్,**



**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి జూలై 13,**

తెలంగాణ రాష్ట్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు భయపడి 42% బిసి రిజర్వేషన్లు తెరమీదకు తీసుకొచ్చిందని డోర్నకల్ మాజీ శాసనసభ్యులు డిఎస్ రెడ్యా నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని అయ్యగారి పల్లి గ్రామంలో జిల్లా సీనియర్ నాయకులు బజ్జూరు పిచ్చిరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కారు స్థానిక సంస్థల ఎన్నికలంటే భయపడి ఇన్ని నెలలు ఎన్నికలు జరుపకుండా కాలం గడిపిందని కోర్టు అక్షంతలు వేసేసరికి భయపడి 42% బిసి రిజర్వేషన్లని తెరమీదకు తీసుకొచ్చి ఎన్నికలకు పోవాలని ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టిన టిఆర్ఎస్ పార్టీకి 80 శాతం సీట్లు వస్తాయని ఆయన అన్నారు. ప్రజలు ఎప్పుడో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం వదిలేసుకున్నారని మళ్లీ కెసిఆర్ గవర్నమెంట్ రావాలని ప్రజల కోరుకుంటున్నారని ఆయన అన్నారు. ప్రజా ప్రభుత్వం అనుకుంటున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం దాచుకో దోచుకో అన్న చందంగా ఉందని ప్రజలను పట్టించుకునే నాధుడే లేడని పిల్లలకు గురుకులంలో సీట్లు కావాలంటే ఎవరిని అడగాలో తెలియక నా దగ్గరికి వస్తున్నారని నేను ఓడిపోయిన ఎమ్మెల్యేను అని వాళ్ళకి చెప్పిన కూడా వినిపించుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి. మండల పార్టీ అధ్యక్షులు తోట లాలయ్య. దొడ్డ గోవర్ధన్ రెడ్డి. టిఆర్ఎస్వి జిల్లా నాయకులు గుగులోతు రవి నాయక్. బుడిగే లక్ష్మయ్య. తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**తొవ్వ,గార్ల జూలై 13**

గార్ల మండల పరిధిలోని సీతంపేట గ్రామానికి చెందిన తాటి వెంకటేష్ (32) ఇటీవల అనారోగ్యం మృతి చెందారు. బాధిత కుటుంబానికి శ్రీ శక్తి అవార్డు గ్రహీత శంషాద్ భేగం, గండు శ్రీనివాస రావు, భూక్యా సర్వేష్, సంపసాల. ఉపేందర్ రావు, గండు బిక్షపతి, బండి ఉష పరామర్శించారు. 50 కేజీలు బియ్యం అందజేశారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తాటి దుర్గ రావు, తాటి బెనర్జీ, కొండయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



## మన్సూరాబాద్ డివిజన్ కుమ్మర్ల సంఘం కమిటీ ఆధ్వర్యంలో బోనాల పండుగ కార్యక్రమం



**తొవ్వ : 13 జులై,ఎల్బీనగర్ ప్రతినిధి**

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పాత గ్రామంలోని కుమ్మర్ల సంఘం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, భాస్కర్ యాదవ్ తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వానలు రావాలని కక్కిరేణిలో వరద పాశం



**యాదాద్రి జిల్లాబీ రామన్నపేట: తోవ్వ ప్రతినిధి బీజులై 13**

రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో వర్షాలు లేక పత్తి , వరి ఇతర పంటలు వేసుకోలేక వానలు రాక వ్యవసాయం చేసుకోలేక వరుణ దేవుని కోసం ఎదురు చూస్తున్న క్రమంలో ఆదివారం గ్రామంలోని మహిళలు శివాలయంలోని నంది విగ్రహానికి నీళ్లు పోసి అనంతరం గంగాదేవి గుడి వద్ద ప్రత్యేకమైన పూజలు ,బోనం పెట్టి , తీపి వంటలు చేసి బండమీద వరద పాశం పోసి పిల్లలచే నాకించారు.ఇలా చేస్తే వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురుస్తాయని నమ్మకంతో గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు.అనంతరం మహిళలు చుట్టు కాముడు వేస్తూ వరుణ దేవుడు , గంగమ్మ తల్లి పాటలు పాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జక్కుల నరసింహ , మర్రి యాదయ్య , మాంద్ర ముత్యాలు , కన్నెబోయిన యాదయ్య , మహిళలు కేతమ్మ , జయమ్మ , అండాలు , పూలమ్మ , కలమ్మ , పద్మ , మల్లమ్మ , పారిజాత ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**యాదాద్రి జిల్లా :వలిగొండ: తోవ్వ ప్రతినిధి :జులై 13**

వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999- 2000 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాల నెమరు వేసుకొని, తరగతి గదిలో జరిగిన చిలిపి చేష్టలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలవడంతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణంలా కనిపించింది. అనంతరం విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అలనాటి గురువులు భాషెట్టి కృష్ణమూర్తి, సింహయ్య, ఎల్లయ్య, చెన్నకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, చేగూరి మల్లేశం, బిక్షపతి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు

**తొవ్వ, ప్రతినిధి, నర్సంపేట, జూలై,13:**



నర్సంపేట మున్సిపాలిటీ 24 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెరుమాండ్ల రవి తండ్రి పెరుమాండ్ల రాములు నిన్న మరణించగా వారి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించిన ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు గోనె యువరాజు, పట్టణ పార్టీ ముఖ్య నాయకులు మండల శ్రీనివాస్, బండి ప్రవీణ్, చుక్క అనిల్, మంద ప్రసాద్, రాయరాకుల సారంగం, అప్పల సుదర్శన్, మద్దెల సాంబయ్య , తదితరులు పాల్గొన్నారు.




## అలాంటి వాడితోనే తాళి కట్టించుకుంటా!

త్రిష ప్రస్తుతం 'థగ్ లైఫ్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఆమె ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో వివాహం గురించి ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. వివాహబంధంపై మీ అభిప్రాయమేంటి? అనే ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. 'జరుగుతున్న పరిణామాలు, చూస్తున్న నిదర్శనాలను బట్టి ప్రస్తుతానికైతే పెళ్లిపై నాకంత సదభిప్రాయం లేదు. నిజం చెప్పాలంటే మూడుముళ్ల బంధంపై నాకు నమ్మకం పోయింది. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. కొందరైతే విడాకులు తీసుకుంటున్నారు. అలాంటి పరిస్థితి నాకు రాకూడదని కోరుకుంటున్నా' అన్నారు త్రిష. ఇంకా చెబుతూ 'పెళ్లి ఎందుకు చేసుకోలేదు? అనడిగితే నాదగ్గర సమాధానం లేదు. ఎప్పుడు చేసుకుంటారు? అనంటే నాకు తెలియదు. అసలు నాకు పెళ్లి యోగం ఉందో లేదో తెలియదు. పెళ్లి జరిగినా ఓకే.. జరక్కపోయినా ఓకే. నాకైతే బాధ లేదు. మనిషి ఆశాజీవి కాబట్టి ఒక్కటి మాత్రం చెబుతా.. పెళ్లంటూ చేసుకుంటే నచ్చినవాడ్నే చేసుకుంటా. వాడు జీవితాంతం నాకు తోడుంటాడని నమ్మితేనే తాళికట్టించుకుంటా. ఇదిమాత్రం పక్కా' అని చెప్పుకొచ్చారు త్రిష. ఈ సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ సైతం షాకయ్యారు.

## త్రివిక్రమ్‌ను పక్కన పెడుతున్న తెలుగు హీరోలు



కొన్ని రోజుల క్రితం త్రివిక్రమ్ సినిమా అంటే హీరోలకి గ్యారంటీ హిట్ అనే నమ్మకం ఉండేది. విభిన్న కథలతో, చమత్కారమైన సంభాషణలతో ఆయన ఒక ప్రత్యేకమైన మార్క్‌ను ఏర్పరచుకున్నారు. అయితే ఇటీవల "గుంటూరు కారం" లాంటి భారీ అంచనాల సినిమా ఆశించిన విజయం సాధించకపోవడంతో, స్టార్ హీరోలు త్రివిక్రమ్ సినిమాల పట్ల కొంచెం వెనుకంజ వేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ లాంటి స్టార్ హీరోలు కూడా ప్రాధాన్యతను అట్లీ లాంటి డైరెక్టర్లకు ఇస్తున్నారని వార్తలు రావడం, ఈ పరిణామానికి ఉదాహరణ. ఓ జమానాలో హీరోలు ఆయన డేట్స్ కోసం వెయిట్ చేస్తే, ఇప్పుడు మాత్రం ఆ ఉత్సాహం కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. తన ప్రత్యేకమైన డైరెక్షన్ స్టైల్‌కు మళ్లీ క్రేజ్ తీసుకురావాలంటే త్రివిక్రమ్ ఓ బ్లాక్‌బస్టర్ హిట్ అవసరం. ఆయన టాలెంట్‌పై ఎలాంటి సందేహం లేదు, కానీ ట్రెండ్‌కి తగినట్టు మారడం ఇప్పుడు అత్యవసరం.ఇక రాబోయే సినిమాలే ఆయన పునరాగమనానికి నాంది అవుతాయో లేదో వేచి చూడాలి!




### శివరాజ్‌కుమార్ క్యాన్సర్

## పోరాటంపై డాక్యుమెంటరీ..

కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ క్యాన్సర్ నుంచి కోలుకున్న విషయం తెలిసిందే. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామీ క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ కోసం శస్త్రచికిత్స చేయించుకుని విజయవంతంగా ఇండియాకు తిరిగివచ్చాడు శివన్న. అయితే క్యాన్సర్ నుంచి కోలుకున్న అనంతరం ఆ మహమ్మారిపై తాను చేసిన పోరాటాన్ని తెలియజేసేలా ఒక డాక్యుమెంటరీని తెరకెక్కిస్తున్నట్లు శివరాజ్ కుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన అప్‌డేట్‌ను ప్రకటించారు. 'సర్వైవర్' అనే పేరుతో రాబోతున్న ఈ డాక్యుమెంటరీకి ప్రదీప్ కె శాస్త్రి దర్శకత్వం వహిస్తుండగా.. శివరాజ్‌కుమార్ భార్య గీతా శివరాజ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. ఇక సినిమాల విషయానికొస్తే సప్త సాగరాలు దాటి చిత్ర దర్శకుడు హేమంత్ రావు దర్శకత్వంలో 666 ఆపరేషన్ థియేటర్ అనే సినిమా చేస్తున్న శివన్న.. తెలుగులో పెద్ది అనే సినిమా చేస్తున్నాడు. రామ్‌చరణ్-బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఈ సినిమా రాబోతుంది.

## సమంతా.. మళ్ళీ డీప్ లవ్..

### త్వరలో పెళ్లి బాజాలు

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ తన నటనతో అందరినీ ఆకట్టుకున్న సమంతా రూత్ ప్రభు ప్రేమ వ్యవహారంలో మరోసారి వార్తల్లో నిలిచింది. ఈసారి ఆమెకు జోడీగా ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు పేరు వినిపిస్తోంది. ఇద్దరూ గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సమంత, రాజ్ కలిసి పికిల్ బాల్ టోర్నమెంట్‌లో కనిపించడమే కాకుండా, పలువురు సెలబ్రిటీల బర్త్ డే పార్టీలు, మ్యారేజ్ ఈవెంట్లలో కూడా కలిసి దర్శనమిచ్చారు. సమంత సినీ రంగ ప్రవేశానికి 15 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా జరిగిన అవార్డ్ ఫంక్షన్‌లో రాజ్ కూడా పాల్గొనడం గమనార్హం. వీటన్నింటి నుంచి ఈ జంట మధ్య బంధం కేవలం స్నేహానికే పరిమితం కాదని అభిమానులు అంచనా వేస్తున్నారు. తాజాగా ఈ జంట త్వరలో పెళ్లిపీటలెక్కబోతున్నారని గాసిప్ మేధావులు ప్రచారం చేస్తున్నారు. సమంత, రాజ్ నిడిమోరుతో డేటింగ్‌లో ఉన్నదీ, త్వరలోనే అతడితో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నదీ వార్తల సారాంశం. అయితే ఇప్పటివరకు సమంతా, రాజ్ ఈ విషయంపై స్పందించలేదు. ఇదిలా ఉండగా, రాజ్ నిడిమోరు 'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ', 'గన్స్ %ಊ% గులాబ్స్' వంటి హిట్ సిరీస్‌లను తెరకెక్కించిన దక్షిణాది దర్శకుడు. సమంతతో ఆయనకు పరిచయం 'ఫ్యామిలీ మ్యాన్ 2' సెట్‌లో మొదలై స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారినట్లు చర్చలు సాగుతున్నాయి.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146